# ముగింపు మీరే చెప్పండి

ప్రేక్షక మహాశయులందరికీ నమస్కారం!

మీరంతా నా ఆహ్వానాన్ని మన్నించి నా యెడల అపారమైన దయతో ఈ నాటక ప్రదర్శనకు విచ్చేసినందుకు కృతజ్ఞుడ్ని, మీరంతా పెద్దలు, గొప్పవారు. పుర ప్రముఖులు, నాయకులు, మీరంతా కారణజన్ములు. ఈ సంఘాన్ని ఈ దేశాన్ని ఉద్ధరించడానికి పుట్టిన మహాత్ములు. మీరంతా ఆ లక్ష్మీదేవి చల్లని మూపుకి నోచుకున్న పుణ్యాత్ములు. మీరంతా నిత్యమూ పూజలు చేసే పరమభక్తులు మీరు చెప్పింది వేదం. కాదనడానికెవడికున్నాయి దమ్ములు!

ఇంత గొప్పవారైన మీరంతా, ఈ వేళ మీ ఘన కార్యాలన్నీ మానుకుని-క్షమించండి. అంటే నా ఉద్దేశ్యం-మీరు రోజూ చేసే గొప్ప పనులన్నీ మానుకుని - ఈ నాటకం చూడ్డానికొచ్చారంటే నిజంగా అది నా పూర్వ జన్మ సుకృతమనే చెప్పాలి. లేక పోతే రోజూ ఈ సమయానికి మీరు ప్రజా సంక్షేమం కోసం దేశ శ్రేయస్సు కోసం ఏ రాజకీయ వ్యూహం రచిస్తూ వుండేవారో ఒకణ్ని

గద్దెదించి, మరొక్కణ్ణి ఎక్కించి. ఒకడికితలవంచి మరొకడి తల తీయించి, ఒకణ్ణి ఆకాశానికెత్తి ఒకణ్ణి నట్టేట్లో ముంచి, మిమ్మల్ని కాదన్న వాళ్ళందర్నీ కాలరాచి - ఈ రకమైన 'శిష్ట రక్షణ' 'దుష్ట రక్షణ' కార్యక్రమాలేవి నిర్వహిస్తూండే వారో !

అలాంటి మీారు అంత ముఖ్యమైన పనులన్నీ మాను కుని, కార్లలో కూర్చుని కష్టపడి యిక్కడిదాకా ఈ నాటకం కోసం వచ్చినందుకు మరోసారి మీాకు ధన్యవాదా లర్పిస్తున్నాను. ఇంకా మిమ్మల్ని నిరీక్షింప జెయ్యడం నా కిష్టంలేదు. అదిగో చూడండి. తెరలేస్తోంది. !

చూశారా ? చూస్తున్నారా ? రంగస్థలమంతా చీకటి చీకటిగా వుంది. ఒక్కసారి మీా నల్ల కళ్ళద్దాలన్నీ తీసి చూస్తే తప్ప మీాకేం కనబడదు. మీారు చూసే దేమి టంటారా ?

అదొక యిల్లు - కాదు గుడిసె చూరు నేల కంటు కున్నట్లుగా వుంది. నేల గోతులు గోతులుగావుంది. గోడలు లేవు - గోడలుండాల్సిన చోట తడికలున్నాయి-చిల్లులుపడి డబ్బా రేకులున్నాయి - తుప్పుపట్టి.

ఆ తడికల్లోపల, ఆ రేకుల్లోపల చీకటుంది. ఆచీకట్లో కిరసనాయిలు బుడ్డి దీపం వుండీ లేనట్లుగా వుంది ఆ గుడి సెలో వెలుగుకంటే చీకటే ఎక్కువగా వుంటుంది. రాత్రి

పగలూ కూడ, మీరా చీకట్లోకి జాగ్రత్తగా చూస్తే-ఒక మూల - నులక తెగి, కోళ్ళు విరిగిన మంచం కనుపిస్తుంది. ఆ మంచం మీద ముడుచుకు పడుకున్న పదేళ్ళ కుర్రాడు మీకు పూర్తిగా కనిపించడు మీరు జాగ్రత్తగా చూస్తే ఆ కుర్రాడి మొహం మాత్రం కనపడొచ్చు. అదైనా నమ్మకం లేదులెండి. అసలే రూపాయి కానంత మొహం ఆకలితోనూ రోగం తోనూ డోక్కుపోయి నయాపైసంత యింది. కళ్ళు గుంటలుపడితే, ఆ గుంటల్లో చీకటి కాపుర మెట్టింది. కదలకుండా మెదలకుండా కట్టెలా పడుకున్నాడు. మీరంతా వచ్చారని తెలిసినా ఆ కుర్రాడు లేవలేడు: నటించలేడు, కాస్సేపలా పడుకోనివ్వండి పాపం!

మీకు శ్రమ యిస్తున్నాను మన్నించండి! మీరలా కాసేపు ఆ మసక చీకట్లోనే వెతికితే - ఆ గుడిసెలో - మట్టికుండలూ, దాకలు, అంచులు విరిగిన సత్తుగిన్నెలూ చిరిగి పీలికలైన గుడ్డలూ, గోనెగుడ్డలూ. చింకి చాపలూ కాక - మరో నలుగురు మనుషుల్లాంటి వారు కనిపిస్తారు. వాళ్ళల్లో ముగ్గురు పిల్లలు అందర్లోకి చిన్నది - మూడేళ్ళ వయసుది - వొంటిమీద గుడ్డముక్క లేనిది - నేల మీద పడి నిద్రపోతుంది ఇంతకుముందు ఏడ్చినపుడు కారిన కన్నీళ్ళ చారికలు, ఆ చీకట్లో ఆ నల్ల బుగ్గల మీద మీ కిప్పుడు కనిపించవు.

మిగతా వాళ్ళిద్దరూ - అయిదేళ్ళ పిల్లొకటీ, ఏడేళ్ళ వాడొకడూ. ఒకళ్ళుగోనె పట్టా మీద కూర్చుని ఒకళ్ళు చాప

మీద పడుకుని వున్నారు. ఇద్దరికీ చిరిగిన లాగులు తప్ప వంటి మీద మరేంలేవు, వొంట్లో బొమికలు తప్ప మరేంలేవు. కడుపులో ఆకలుంది. ఒకళ్ళు గుడిసె కప్పుమీద బుగిలి పోయిన తాటాకుల్లోంకీ, మరొకళ్ళు గుడిసె గుమ్మంలోంచి గుడిసెలో కంటె కాస్త వెలుగ్గా వున్న బయటికీ చూస్తున్నారు.

ఇంక గుడిసె గుమ్మానికడ్డంగా - అదే లెండి, లోపలికి దూరేకంతకడ్డంగా - బుడ్డి దీపం ముందెట్టుకుని, కాళ్ళు బారాజాపుక్కూచున్న ఆడ మనిషి ఆ పిల్లలందరికీ తల్లి! ముఫ్ఫయ్యేళ్ళు నిండా వుండక పోవచ్చు. మీరు నమ్మరు. నాకు తెలుసు-నిజమే యాభయ్యేళ్ళ దానిలా వుంది తల దుబ్బులావుంది. మొహం సాగిపోయివుంది జాకెట్ లోని వక్షం ఎడారిలా ఎండిపోయివుంది. కనబడదు గాని లోపలి గుండె కూడా అంతే! లోపలి చీకటి బయటికి పోకుండానూ, బయటి వెలుగు లోపలికి రాకుండానూ. కాపలా కాస్తున్నట్లుగా, అలా గుమ్మానికడ్డంగా కూర్చుని, బుడ్డిదీపం వెల్తుర్లో గుండెల దగ్గర చిరిగి పోయిన మొగుడి చొక్కాకి మాసికలేసి కుడ్తోంది. సూది వొకసారి వేలికి గుచ్చుకుందిగాని, రక్తం రాలేదు.

అయ్యో! ఇప్పటికి మీరు స్టేజ మీద చూస్తున్న పాత్రల పరిచయమైంది. త్వరలో రాబోయే పాత్రలు మరో రెండున్నాయి. మీ కిబ్బందిలేకుండా వాటి

గురించి కూడా ఇప్పుడే నాలుగు ముక్కలు చెప్పేస్తాను. మీరు చూస్తున్న పిల్లల అన్న-పన్నెండేళ్ళ వాడు-జీళ్ళూ మరమరాలుండలూ, శెనగపప్పుండలూ- అన్నీ కలిపి అర్థరూపాయి చేసేవి- ఒక రేకు పళ్ళెంలో పెట్టుకుని అమ్మడానికని పొద్దుననగా వెళ్ళాడు. ఇంకా రాలేదు. ఇహనో యిప్పుడో రావాలి.

పోతే, ఆ పిల్లల తండ్రీ-యాభయేళ్ళ దానిలా కనిపిస్తున్న ఆ ముప్పయేళ్ళ స్త్రీ భర్తా- ఆ గుడిసెలో నిలవుంటున్న చీకటికీ, రోగాలకీ, ఆకలికీ యజమాని అయిన-ప్రధాన పాత్రధారి కూడా ఇంకా రాలేదు. ఎప్పుడొస్తాడో తెలీదు- అసలొస్తాడో రాడో తెలీదు. కాని అతగాడొస్తాడేమో. నాలుగ్గింజలు తెస్తాడేమో, నిన్నటినుంచీ కడుపుల్లో రాజ్యమేలుతున్న ఆకలి ఈ పూటయినా కాస్త తగ్గుతుందేమోనని- మంచం మీద సగం చచ్చిపడున్న కుర్రాడూ, నేలమీద ఆదమరచి పడుకున్న పసిదీ తప్ప-మిగతా వాళ్లంతా ఎదురు చూస్తున్నారు.

ఆ పిల్లల తండ్రికి-నలభయేళ్ళలోపు వయసుంటుంది. అతని గుండె లోతుల్లోకి గునపాలెట్టి తవ్వి చూస్తే, కనీసం వందేళ్ళ అనుభవాలూ, కష్టాలూ, కడగండ్లూ, గడ్డకట్టిన కన్నీటి పొరలూ కనిపిస్తాయి. నలభయ్యేళ్ళ బ్రతుకులో అతను బ్రతకటంకోసం చేసిన. చేస్తున్న సవాలక్ష ప్రయత్నాలూ, అతన్ని బ్రతకనివ్వకుండా, చావనివ్వకుండా

చంపుతున్న వాళ్ళ కథలూ దొరుకుతాయి. ఇప్పుడతను ఎలా బ్రతుకుతున్నాడూ అంటే చెప్పడం కష్టం. బ్రతకడంకంటే చచ్చిపోవడమే బాగా నేర్చుకున్నాడు. వీలు దొరికినప్పుడల్లా చచ్చిపోతూ వుంటాడు బ్రతికివున్నప్పుడు రిక్షాలు లాగుతాడు, మార్కెట్లో సరుకులు మోస్తాడు. అందువల్ల వచ్చే డబ్బు అతనూ అతని పెళ్ళాం బిడ్డలూ బ్రతకడానికి చాలదు. పెళ్లాంబిడ్డల్ని చంపలేక తనేచచ్చిపోతూ వుంటాడు. చచ్చిపోయినప్పుడల్లా-క్షమించండి... అంతా ముందే చెప్పేస్తున్నాను. మరి కాస్సేపట్లో మీరే చూస్తారుగా! అదిగో చూస్తున్నారా? మేలుకుని వున్న పిల్లలిద్దరూ మధ్యమధ్యన 'అమ్మా-అమ్మా' అని నీరసంగా పిలుస్తున్నారు, అన్నం అన్నమని అడుగుతున్నారు. అడిగే వోపిక లేక మెల్లగా ఏడుస్తున్నారు

గుమ్మానికడ్డుగా కూర్చున్న తల్లి ఎడారి గుండెలో, బాధల ఇసుక రేణువులు పెరిగి పెరిగి బండరాళ్ళంతవుతున్నాయి. ఆ బరువుకి-పిల్లల్ని ఊరడించడానికి అందామనుకున్న మాటలు గొంతులోంచి బయటికి రాక లోపలికే దిగిపోతున్నాయి ఊరికే అలా చూస్తూ వుండిపోయింది మొగుడి చొక్కా చిరుగులు పూర్తిగా కుట్టడానికి దారం చాల్లేదు.

అదిగో సార్, చూడండి! అలా వెర్రిగా, నిర్జీవంగా కూర్చుండిపోయిన తల్లిని తప్పుకుని- పెద్ద కుర్రాడు గుడిసె లోపలి కొస్తున్నాడు. చేతిలో రేకుపళ్ళెముంది పళ్ళెంలో

అమ్ముడుపోగా మిగిలిన జీళ్ళూ వుండలూ వున్నాయి. పళ్ళెం ఓ మూల పెట్టి ఒక గోనెపట్టా పరచుకొని దాని మీద చతికిలబడ్డాడు. రెండు చేతుల్తోనూ కాళ్ళు పిసుక్కుంటున్నాడు. ఎందుకంటారా? ఎందుకేమిటి సార్? పసివాడు! పొద్దుట్నుంచీ ఎండలో తిరిగాడు-పళ్ళెం వుచ్చుకుని. కడుపులో ఏమీ లేదు. కాళ్ళు పీకేలా అంత తిరిగినా సగం జీళ్ళూ, వుండలూ అలాగే వుండిపోయాయి. అన్నీ అమ్ముడు పోతేనేగాని పదిపైసలు మిగలవు. కాళ్ళు పిసుక్కుంటూ తమ్ముడివంకా చెల్లెలివంకా, తల్లివంకా చూశాడు. అన్నం పెట్టమని అడగటం అనవసరమని తెలుసుకున్నాడు తల్లి వొళ్లో సగం చిరుగులుపట్టి వున్న చొక్కా చూశాడు. లాగుజేబులో చిల్లుండి ఇవ్వాళ సంపాదించిన మూడ్రూపాయి పైసల్లోనూ పదిపైసలు పోయిన సంగతి గబుక్కున గుర్తొచ్చింది తల్చుకుంటే ఏడుపొస్తోంది ఆ సంగతి తల్లితో చెబుదామనుకున్నాడు చెప్పలేదు. అలాగే కాళ్లు పిసుక్కుంటూ కూర్చున్నాడు.

అప్పటిదాకా అన్నం అన్నమంటూ. బిగ్గరగా ఏడవలేక మెల్లగా ఏడుస్తూన్న పిల్లలిద్దరూ- అటు ఆ మూలకేసి, ఆశగా, బితుకు బితుకు మంటూ ఎందుకు చూస్తున్నారో మీకు తెలుసా సార్? తెలీదు. నేనే చెప్తున్నాను వినండి. అన్న బజార్నుంచి తెచ్చి ఆ మూల పెట్టిన పళ్లెంలో జీళ్ళున్నాయి శనగ పప్పుండలున్నాయి. అందుకూ వాళ్ళలా చూస్తున్నది. కాని అది తింటామని అడిగే

ధైర్యంగాని' లేచివెళ్ళి తీసుకుతినే ధైర్యంగాని వాళ్ళకి లేవు. లోగడ కొన్నిసార్లు అలా తిన్నందుకు అన్నచేతా, అమ్మచేతా బాగా తన్నులు తిన్నారు. ఆ జీళ్ళూ, వుండలూ వాళ్ళ యింట్లోవికావు అన్న ఏదో కొట్లో తెచ్చి, పైసా అరపైసా లాభానికమ్మి వాళ్ళకి డబ్బు కట్టేస్తాడు. ఏ రోజు డబ్బు ఆ రోజు కట్టకపోతే కొత్త సరుకివ్వరు.

ఆ పిల్లలు ఆశతో ఆకలితో ఆ పళ్ళెంకేసి అలా చూస్తుండగానే, పెద్దకుర్రాడు కాళ్ళు పిసుక్కుంటూ వుండగానే, ఏమీ చెయ్యలేని తల్లి గుమ్మంలో అలా కాళ్ళు బారజాపుకుని కూర్చుని వుండగానే, అదుగో చూడండి- చూడండి సార్ చూడండి- ఆ పిల్లల్ని కన్నవాడూ, ఆ యిల్లాల్ని కట్టుకున్నవాడు- ఆ గుడిసెకీ, గుడిసెలోని చీకటికీ యజమాని- అదుగదుగో వస్తున్నాడు! గుండెలో దాచుకుందామనుకున్న చీకటి ఎంత ప్రయత్నించినా దాగక-పొంగిపొంగి, బయటికొచ్చి వాళ్ళంతా అలుముకున్నట్టుగా-నల్లగా అతినల్లగా వస్తున్నాడు. ఆకలేసినప్పుడల్లా అన్నం లేక. అన్నంబదులు మిగిలిన బాధలూ, కష్టాలు కడగళ్ళూ వికటించి, కడుపులో దేవుతున్నట్టుగా తూలుతూ వస్తున్నాడు. కళ్ళు ఎర్రగా మండుతున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి. దారికడ్డంగా కూచున్న పెళ్ళాన్ని లాగి తన్నాడు. లోపలికొచ్చాడు. ఏమిటో అంటున్నాడు వినండి- "అన్నమెట్టే లంజా-" అని అరుస్తున్నాడు బూతులు తిడుతున్నాడు. భార్య గుమ్మంలోంచి లేచింది. మెల్లగా వెళ్ళి ఖాళీగావున్న కుండ తెచ్చి చూపించింది. అతను కుండ

లాంతర్ని నేలకేసి కొట్టాడు. పగిలి ముక్కలైంది. భార్య వంక మండిపడుతూ చూశాడు మళ్ళీ బూతులు తిట్టాడు. వంగదీసి వీపుమీద దబాదబా నాలుగు గుద్దులు గుద్దాడు. మళ్ళీ ఓ తన్ను తన్నాడు ఆ తన్నుకి మంచమ్మీదికెళ్ళి పడింది. చావుబతుకుల పొలిమేరల్లో వున్న రోగిష్టికుర్రాడు-తనమీద ఆకాశం కాబోలు విరిగి పడిందనుకొని, జడుసుకొని మెల్లగా కళ్ళువిప్పి చూసి, ఏడిచే శక్తిలేక మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. చాపమీద నిద్రపోతున్న పసిది-ఉలిక్కిపడి లేచి, బిగ్గరగా ఏడుపు లంకించుకున్నది. మిగతా ముగ్గురు పిల్లలూ ఏడవటానికి భయపడుతూ నక్కి నక్కి కూచున్నారు. జేబులో యింకో అర్ధరూపాయుందని తాగి వచ్చాడు మర్చిపోయిన-గుడిసె యజమాని మళ్ళీ తాగడానికి గుడిసెలోంచి బయటికెళ్ళి పోయాడు అదే సమయమని గుడిసెలో చీకటి పేట్రేగిపోయింది. గుడిసెలోపలి ఆ చీకటికి, గుడిసె బయటినుంచి వస్తున్న ఈదురుగాలికి బుడ్డిదీపం గుండె ఆగిపోయింది. తెర జారింది.

అయ్యో! యిది సార్ నాటకం! ఇదేం నాటకమంటారా?— మాటల్లేవు; పాటల్లేవు; రొమాన్స్ లేదు: సస్పెన్స్ లేదు, మేకప్ లేదు, కనీసం లైటింగ్ అన్నా సరిగా లేదు—ఇదేం నాటకమంటారా ? ఇవేం పాత్రలంటారా? అంతేసార్! ఈ నాటకమింతే. ఈ పాత్రలింతే. ఈ నాటకమిలా ఉండటానికీ, యీ పాత్రలిలా వుండటానికీ కారకులైన పాత్రలు వేరే వుంటాయి! అవి బయటికి రావు.

ఎక్కడో దాక్కుని వుంటాయి ఎక్కడైనా వుండొచ్చు! క్షమించండి-మీలోనూ వుండొచ్చు!—కనీసం నాటకానికి సరైన ముగింపైనా లేదంటారా? ఈ నాటకం అసలు పూర్తికా లేదు. సార్! ఇలా; ఎన్నో రోజులు, ఎన్నో ఏళ్ళు, నడుస్తూనే వుంటుంది. అక్కడా, యిక్కడా. అన్నిచోట్లా ఇలాంటి నాటకాలు, ఇలాంటి పాత్రలు కొన్ని లక్షలు-చూడొచ్చు మీరు. మీ నల్ల కళ్ళద్దాలు తీసేస్తే ఇలాంటి దర్టీ నాటకాలు యిలా అవిచ్ఛిన్నంగా కొనసాగడం ఏం బావో లేదంటారా? అయితే ఈ నాటకాలింత దర్టీగా. ఈ పాత్ర బ్రతుకులింత దర్టీగా అధ్వాన్నంగా తయారవడానికి కారకు లైన తెరవెనుక పాత్రలు మీరే, మీరే మీరే గనక. ముగింపు కూడా మీరే చెప్పండి!

—